కొత్త కార్డులు.. కళ్లు కాయలు!

- మే నెల నుంచి మంజూరు చేస్తామని ప్రభుత్వ ప్రకటన
- ఈసారైనా చెప్పిన ప్రకారం ఇవ్వడంపై అర్హులకు సందేహాలు
- ఈకేవైసీ గడువు ఈ నెల 30 వరకు పొడిగింపు
- నియోజకవర్గంలో 26,373 మందికి ఇంకా ఈకేవైసీ పెండింగ్

నూతన రేషన్ కార్డుల కోసం నియోజకవర్గంలో అర్హులైన వేలమంది కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. మే నెల నుంచి మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన ఎంతవరకు అమల్లోకి వస్తుందనేది అప్పటివరకు వస్తేగానీ తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు పలుమార్లు కొత్త కార్డులంటూ పాలకులు ఊరించడమే దీనికి కారణం. మరోవైపు ఇప్పటికే కార్డులు ఉన్న వారికి ఈకేవైసీ ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.





రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

మంగళగిరి: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మే నెల నుంచి కార్డులు ఇస్తామని చెప్పడంతో ఇప్పటివరకు కార్డుల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులు ఆశగా ఉన్నారు. మరోవైపు ఇప్పుడున్న రేషన్ కార్డులలో ఈకేవైసీ పూర్తయిన చేసుకున్న వారిని మినహాయించి నూతన కార్డులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రూపు మారనున్న కార్డులు

పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఏటీఎం కార్డుల తరహాలో లబ్ధిదారులకు అందజేయనున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు తొలగింపు, చేర్చడం, కొత్త కార్డుల కోసం ఆప్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త కార్డులు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ కార్డుదారులు ఈకేవైసీ నమోదుకు పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించింది. తొలుత మార్చి 31వ తేదీ వరకే సమయం ఉందని అధికారులు చెప్పినా.. ఈకేవైసీ చేయించుకోని వారు అధికంగా ఉండడంతో గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచారు. రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ నమోదు చేయించాలని కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈకేవైసీ పూర్తి కాని వివరాలను ఆయా డీలర్లు, సచివాలయ సిబ్బందికి పంపించారు. ప్రతి సచివాలయంలో కార్డుదారులను మ్యాపింగ్ చేశారు. బియ్యం కార్డులోని వారంతా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని చెప్పడంతో కార్డుదారులు పిల్లలను సచివాలయాలకు తీసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో 26,373 మంది లబ్ధిదారులు ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. వీరందరూ ఏప్రిల్ నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు కోరారు.

నియోజకవర్గంలో పరిస్థితిదీ..

మండలం	కార్డుల సంఖ్య	సభ్యుల సంఖ్య	ఈకేవైసీ పూర్తయిన వారు	పెండింగ్‌లో ఉన్నవారు
మంగళగిరి	48,205	1,35,349	1,23,136	12,213
తాడేపల్లి	31,886	92,509	83,373	9,136
దుగ్గిరాల	20,118	54,302	49,278	5,024
మొత్తం	1,00,209	282,160	255,787	26,373

కూటమి దౌర్జన్యాలకు భయపడొద్దు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా పార్టీ
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి భరోసా
- ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపు



మహంకాళి అమ్మవారిని దర్శించుకుని బయటకు వస్తున్న వేమారెడ్డి, హనుమంత రావు

దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానం సమీపంలో గల సపోట తోటలలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న వారు అనంతరం కార్యకర్తలతో కలిసి వేదిక వద్దకు వచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు టి. శివ గోపయ్య అధ్యక్షత వహించారు. దుగ్గిరాల మండల కమిటీని సభకి పరిచయం చేశారు. వేమారెడ్డి మాట్లాడుతూ... కూటమి కక్షసాధింపులు, దౌర్జన్యాలకు కార్యకర్తలు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎవరైనా వేధిస్తే అండగా ఉండి కాపాడుకుంటామని తెలిపారు. గ్రామ, మండల కమిటీల ఏర్పాట్లు పూర్తి కావచ్చిందని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తగిన పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇవ్వడమే కారణమని ఆరోపించారు. ప్రస్తుతం వాటిని నిలబెట్టుకోలేకపోతోందని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్‌లు ఉచితంగా చేయించారని తెలిపారు. ప్రజల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, గిట్టుబాటు ధరలు లే క రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రత్నం, జానీ బాషా, రజినీ, గంగాధర్, ఆనంద్ బాబు, తిమోతి, సంసోనమ్మ, సుమన్, ఆదాం, తిలోమణి, నాళికృష్ణ, పలు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తికి నిధులు కేటాయిస్తాం

'ప్రాథమిక బడి.. పట్టించుకోండి' కథనంపై డీఈవో స్పందన

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'ప్రాథమిక బడి.. పట్టించుకోండి' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక స్పందించారు. మండలంలోని కురగల్లు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో తరగతులు చర్చిలో నిర్వహిస్తుండడంపై కథనం ప్రచురితమైంది. డీఈవో స్పందిస్తూ... 'మన బడి.. మన భవిష్యత్తు' రెండో దశ కింద 10 కాంపొనెంట్లు, రెండు అదనపు తరగతుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. పనులు జరుగుతుండగా ఇసుక, సిమెంట్ అందుబాటులో లేకపోవడంతోపాటు నిధులు సరిపోక నిర్మాణాలు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లాలో పెండింగ్ పనులు నిమిత్తం రూ 7.39 కోట్లు నిధులు విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ నిధులలో కొంత భాగం కురగల్లు పాఠశాలకు కేటాయించి మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. తరగతి గదులను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

'సమర్థంగా బాధ్యతల నిర్వహణ'

దుగ్గిరాల: పంచాయతీ కార్యదర్శి బాపయ్య సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారని పలువురు అభినందించారు. దుగ్గిరాలలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం కావూరి బాపయ్యకి పదవీవిరమణ సందర్భంగా సన్మానం జరిగింది. 32 సంవత్సరాలుగా తన విధులను ఎంతో బాధ్యతగా నిర్వహించడం అభినందనీయం అని అధికారులు పేర్కొన్నారు. ఎంపీపీ జబీన్, డీఎల్‌పీఓ స్వరూపారాణి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాస రావు, మాజీ ఎంపీపీ వి.శ్రీకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పలు లేఅవుట్లలో 587 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గృహ నిర్మాణాల కోసం అదనంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. జూన్ నాటికి గృహ ప్రవేశాలు పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో రవిబాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, ఆస్టర్ రమేష్ హాస్పిటల్, అమరావతి ఐ హాస్పిటల్, బ్రేసెస్ అండ్ ఫేసెస్ డెంటల్ హాస్పిటల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చిర్రావూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కేఎల్‌యూ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్య బృందం ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సేవలు అందించిన వైద్యులు దీప్తి, కె. శైలజ, ఎన్. వేణు, ఫణి, భార్గవ్‌లను వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త పి. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం మంగళగిరి నగర పరిధిలోని ఎన్‌సీసీ రోడ్‌లో స్థానిక నాయకులు, నగరపాలక సిబ్బందితో చెత్తను తొలగించడంతోపాటు డ్రైనేజీల్లో పూడిక తీసే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తను సేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలని కోరారు. స్వచ్ఛ మంగళగిరి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీఓఏలకు శిక్షణ తరగతులు



దుగ్గిరాల: రుణ మంజూరు ప్రణాళిక తయారీపై శిక్షణ తరగతులు దుగ్గిరాలలో బుధవారం జరిగాయి. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా వెలుగు ప్రాజెక్టు అధికారి టి.వి. విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సభ్యులకు జీవనోపాధి కోసం ఇచ్చే రుణాలపై వీఓఏలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సైనిక్ ఫండ్ నుంచి మండలానికి రూ.లక్ష చెక్కును శ్రీనిధి మేనేజర్ ఆనంద్‌కి అందజేశారు. కార్యక్రమంలో మురళీ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- డోకిపర్రు గ్రామంలో భారీ గుంతలు
- అడ్డగోలుగా తవ్వేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రామ పరిధిలో తవ్వకాలు జరిపిన ప్రాంతం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మాఫియా రేయింబవళ్లు మట్టిని తరలించి రూ.లక్షలు దండుకుంటోంది. గ్రామ శివారులో తవ్వకాలు అధికంగా జరుపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలతోపాటు రైల్వే ట్రాక్ పక్కన రోడ్డును సైతం వదలకుండా తవ్వుతున్నారు. మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరు ట్రక్కుకు రూ.1500 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు. పెద్ద గుంతలు తీసి మట్టిని సుదూర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. ఒక రైతు పొలంలో బుధవారం తెల్లవారుజామున రెండు పెద్ద గుంతలు తవ్వి మట్టిని తరలించారు. వెళ్లి చూసిన రైతు లబోదిబోమన్నారు. గ్రామంలో ఎటు చూసినా పెద్ద గుంతలే కనపడుతున్నాయి. అధికారులకు తెలిపినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఫొటోలు తీసి కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానం చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదంలో రాజ్యాంగ లక్ష్యాలు



నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ప్రమాదంలో రాజ్యాంగ లక్ష్యాలు ఉన్నాయని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర విధానాలపై బుధవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి, భగత్‌సింగ్ చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పేదలను మరింత పేదరికంలోని పాలకులు నెడుతున్నారని విమర్శించారు. సీనియర్ నేత గుంటక సాంబిరెడ్డి ,పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మునగాల రామారావు, చిన్ని సత్యనారాయణ, ఖాసిం, బాషా, అలీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలో 0–6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆధార్ సర్వీసులను అందజేస్తున్నామని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషల్ ఆధార్ క్యాంపులను ఏప్రిల్ 3 నుంచి 4వ తేదీ వరకు, ఏప్రిల్ 8 - 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీ మంగళగిరి నగర పరిధిలోని బ్యాంక్ కాలనీ, ఇస్లామ్‌పేట, ఇందిరానగర్, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ, తాడేపల్లి రూరల్ పరిధిలోని మహానాడు–1లోను, చిర్రావూరు సచివాలయాల్లోను, ఏప్రిల్ 4వ తేదీన మంగళగిరి నగర పరిధిలోని బ్యాంక్ కాలనీ, ఇస్లామ్‌పేట, కూరగాయల మార్కెట్, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ, తాడేపల్లి రూరల్ పరిధిలోని మహానాడు–2, వడ్డేశ్వరం సచివాలయాల్లోనూ, ఏప్రిల్ 8వ తేదీన మంగళగిరి నగర పరిధిలోని భగత్‌సింగ్ నగర్, షరీఫ్ బజార్, కొప్పురావు కాలనీ, వీవర్స్ కాలనీ, తాడేపల్లి రూరల్ పరిధిలోని కొత్తూరు, పెనుమాక–2 సచివాలయాల్లోనూ, ఏప్రిల్ 9వ తేదీన మంగళగిరి నగర పరిధిలోని భగత్‌సింగ్ నగర్, షరీఫ్ బజార్, ఎన్‌సీసీ రోడ్, మార్కండేయ కాలనీ, తాడేపల్లి రూరల్ పరిధిలోని నవోదయ కాలనీ, పెనుమాక–1 సచివాలయాల్లోనూ, ఏప్రిల్ 10వ తేదీన మంగళగిరి పట్టణ పరిధిలోని బాపనయ్య నగర్, బాప్టిస్ట్‌పేట, టిప్పర్ల బజార్–1, మార్కండేయ కాలనీ, తాడేపల్లి రూరల్ పరిధిలోని సీతానగరం, ఉండవల్లి–1 సచివాలయాల పరిధిలోనూ, ఏప్రిల్ 11వ తేదీన మంగళగిరి పట్టణ పరిధిలోని బాపనయ్య నగర్, బాప్టిస్ట్‌పేట, టిప్పర్ల బజార్–1, టిప్పర్ల బజార్–2, తాడేపల్లిలోని ఉండవల్లి సెంటర్, ఉండవల్లి–2 సచివాలయాల పరిధిలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

దుగ్గిరాల పరిధిలో...

దుగ్గిరాల: ఆధార్ శిబిరాలు మండలంలోని గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు దుగ్గిరాల ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు ఈ క్యాంపులు ఉంటాయన్నారు. శృంగారపురం, దుగ్గిరాల -3న, ఈమని, దుగ్గిరాల - 4న, మంచికలపూడి, చిలువూరు - 8న, పేరకలపూడి, చిలువూరు - 9న, పెదకొండూరు, రేవేంద్రపాడు- 10న, గొడవర్రు, రేవేంద్రపాడు - 11న శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫిరంగిపురం మండలంలో...

ఫిరంగిపురం: మండలంలోని నాలుగు గ్రామాల్లో గురువారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో కార్డులు లేని 0–6, 6–15 ఏళ్ల పిల్లలకు నూతన ఆధార్ జారీ, వివరాల్లో మార్పుచేర్పులు వంటివి చేయనున్నట్లు చెప్పారు. 113 తాళ్లూరు అంగన్‌వాడీ సెంటర్, పొనుగుపాడు సచివాలయం వద్ద 3 నుంచి 5 వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వేములూరిపాడు అంగన్‌వాడీ సెంటర్, ఫిరంగిపురం–3 సచివాలయంలో 8 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 9.30 - సాయంత్రం 5.30 గంటల వరకు శిబిరాలు ఉంటాయని చెప్పారు. డీఏలు జి.సునీత, అన్నా యోజస్వమాలికా, మహిళా పోలీసులు ఎం.శాంతి, సీహెచ్ వాత్సల్య, పి.వెంకట నాగశ్రావణిలు ఆధార్ నమోదు చేయనున్నట్లు వివరించారు.

పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 22 వేల మంది ఇళ్లపట్టాలు, రిజిస్ట్రేషన్ల సౌకర్యం కోసం ఎదురు చూస్తున్నారని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణంలోకి కొండ చుట్టూ ఉన్న నివాసదారులకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామని మంత్రి లోకేష్ గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రైల్వే స్థలాల్లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మాట నిలబెట్టుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మంగళగిరి టౌన్: అనుమానాదాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మంగళగిరి పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని పాతబస్టాండ్ సమీపం వీఆర్ డార్మెటరీలో పది రోజులుగా అమరావతి, క్రోసూరు మండలం, అనంతవరానికి చెందిన ఉసిరికాయల మహేష్ (40) అనే వ్యక్తి మంచం అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. రోజూ తాపీ పనికి వెళ్లొచ్చేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్న సమయంలో వచ్చి నిద్రించాడు. రాత్రి అయినా లేవకపోవడంతో బోర్లా పడుకున్న మహేష్‌ను తిప్పి చూడగా మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించారు. సీఐ వినోద్‌కుమార్ వచ్చి వివరాలు సేకరించారు. చినకాకానిలోని ప్రైవేటు ఆసుపత్రిలో గతంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసినప్పుడు ఓ ఉద్యోగినిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని, గొడవలు రావడంతో దూరంగా ఉంటున్నాడని సీఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహేష్ ముఖం, చేతులపై రక్తపు మరకలు ఉన్నాయి. కంటిపై చిన్న గాయం ఉంది. ఫిట్స్ కానీ, స్ట్రోక్ గానీ వచ్చి ఉండవచ్చని, ఆ క్రమంలో మొలలు పగిలి రక్తం కారి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆవిష్కరణలతోనే ముందడుగు



మంగళగిరి: విద్యార్థుల వినూత్న ఆవిష్కరణకు ఆరంభమే ఐఐటీకి ముందడుగు అని ఐఐటీ మద్రాస్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ యూవీ వరదరాజు అన్నారు. నగర పరిధిలోని కాజలో ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూలులో బుధవారం ఐఐటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరదరాజు మాట్లాడుతూ జీవితంలో కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ పార్థసారథి, స్కూలు ప్రిన్సిపల్ ప్రసన్న జాయ్, మేనేజర్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

తాడికొండ: గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజల నుంచి 40 అర్జీలు స్వీకరించారు. పరిష్కరించాలని అధికారులను కోరారు.

సంక్షిప్త వార్తలు

తుళ్లూరు సీఐగా శ్రీనివాసరావు



తాడికొండ: తుళ్లూరు పోలీసు స్టేషన్ సీఐగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. బుధవారం ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో గతంలో ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించినందున ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తగిన చర్యలు చేపడతామన్నారు.

దంతవైద్య శిబిరం



దుగ్గిరాల: మండలంలోని చింతలపూడి గ్రామంలో ఉన్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం డెంటల్ క్యాంపు ఏర్పాటు చేశారు. సిబార్ దంత వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పరీక్షించారు. డాక్టర్ దేవిక, కళాశాల చైర్మన్ చందు రామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్ర విష్ణు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

తాడేపల్లి రూరల్: ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన మాట మార్చారని విమర్శించారు.

రుణ మంజూరుకు పత్రాల పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలంలో రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారి పత్రాల పరిశీలన ప్రక్రియ బుధవారం పూర్తయింది. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 64 యూనిట్లకుగాను 135 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. బ్యాంకర్లతో కలిసి పత్రాలను పరిశీలించామన్నారు. ఈ నెల 10వ తేదీలోగా అర్హుల జాబితా పూర్తి చేస్తామన్నారు. మరునాడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా యూనిట్లు గ్రౌండింగ్ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

'వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు దారుణం'

దుగ్గిరాల: పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం బీజేపీ పొత్తు కోసం ఈ బిల్లుకు మద్దతు తెలపడం శోచనీయం అన్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో మద్దతు తెలిపే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తులలో నాన్ ముస్లింల ప్రమేయం తగదన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



తాడేపల్లి రూరల్: రైతులు పండించిన జొన్న, మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో రైతు సంఘం నాయకులతో కలిసి జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. చిర్రావూరు, ప్రాతూరు గ్రామాల్లో మొక్కజొన్న రైతులు పంట విక్రయానికి ఎదురు చూస్తున్నారని అన్నారు. మద్దతు ధర కల్పించాలని పేర్కొన్నారు.

మైనర్‌పై కేసు నమోదు

తాడికొండ : ద్విచక్ర వాహనంతో చిన్నారిని ఢీకొట్టిన ఘటనలో పొన్నెకల్లు గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలుడిపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... తాడికొండ గ్రామానికి చెందిన షేక్ రసూల్ హుస్సేన్ కుమార్తె నిషా (2) తన సోదరితో కలిసి జెండాచెట్టు సెంటర్ వద్ద దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. రోడ్డు దాటుతున్న సమయంలో పొన్నెకల్లు గ్రామానికి చెందిన బాలుడు టీవీఎస్ ఎక్సెల్ వాహనంతో బాలికను ఢీకొట్టాడు. ప్రమాదంలో బాలిక తలకు తీవ్రగాయమైంది. స్థానికుల సహాయంతో 108 వాహనంలో గుంటూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఐసీయూలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలి



నినదిస్తున్న కూరపాటి స్టీవెన్ తదితరులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు తీర్పులు ఇచ్చినందున ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని యూనియన్ నాయకులు కె. స్టీవెన్ అన్నారు. బుధవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు కె. ఆదినారాయణతో కలసినాయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా వందల కార్మిక కుటుంబాల సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. ఆశీర్వాదం, హగ్గయ్య, గురవయ్య, ఇమాంబీ, నవనీతం, రమాదేవి, దుర్గా భవాని, సువర్చలాదేవి, సుబ్బారావు పాల్గొన్నారు.